అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
1
శనివారం 24 జూన్ 2023

విద్యార్థులకు ఆన్‌లైన్ క్లాసులు రద్దు చేయాలి

ఆసిఫాబాద్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 200ఎం ద్వారా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్లాసులను రద్దు చేయాలని పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌తో కలిసి జిల్లా విద్యాధికారి అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో విద్యార్థులకు 200ఎం గూగుల్ మీట్ ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించారన్నారు. ప్రస్తుతం కరోనా పోయి మామూలు పరిస్థితులు నెలకొన్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ క్లాసులు రద్దు చేశారని అన్నారు. జిల్లాలో మాత్రమే ఈ తరగతులకు కొనసాగుతున్నాయని, వీటిని వెంటనే రద్దు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి పాల్గొన్నారు.



సోలార్ విద్యుత్ కేంద్రం పనుల పరిశీలన

కోటపల్లి : చెన్నూర్-2ఇంక్లైన్ గని అవరణలో ఏర్పాటు చేయబోయే 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి, సోలార్ జనరల్ మేనేజర్ జానకిరామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీలైనంత త్వరగా పనులను పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రమేష్ బాబు, ఏరియా వర్క్‌షాప్ డీజీఎం చంద్రశేఖర్‌రెడ్డి, డీజీఎం సివిల్ శివ పాల్గొన్నారు.



చట్టసభల్లో బీసీల రిజర్వేషన్లకు కేసీఆర్ పోరాటం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

చట్టసభలలో బీసీల రిజర్వేషన్లకు ముఖ్యమంత్రి కేసీఆర్ పోరాటం చేయాలని బీసీ సంక్షేమ సంఘం కరీంనగర్ జోనల్ కన్వీనర్ కేపీ నరసింహులు అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచినప్పటికీ అసెంబ్లీ, పార్లమెంటులో బీసీలకు రిజర్వేషన్లు లేకపోవడంతో వందలాది బీసీ కులస్తులు ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా చట్టసభల్లో అడుగుపెట్టలేకపోతున్నారన్నారు. 75 ఏళ్లుగా పరిపాలిస్తున్న కాంగ్రెస్, బిజెపి స్వార్థ సంకుచిత రాజకీయాలతో ఇలా జరుగుతోందన్నారు. కెసిఆర్ 2001లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమం ప్రారంభించి సాధించుకున్న విధంగా ఇప్పుడు బీసీలకు నాయకత్వం వహించి బీసీ రిజర్వేషన్లకై పోరాటం చేయాలన్నారు. బీసీ కులాల్లోని అన్ని వర్గాలకు లక్ష రూపాయల సహాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కో కన్వీనర్ కడార్ల నర్సయ్య, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు శెట్టిపల్లి గంగయ్య, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరు చంద్రయ్య, ఆడెపు లక్ష్మీనారాయణ, కోడి జుట్టు రాజన్న, శ్రీరాముల గంగాధర్, మామిడి విజయ్, కుంట మహేష్, ఐలవేణి రవి, బట్టల లచ్చాగౌడ్, పురుషోత్తం, ఊరే ప్రకాష్ పాల్గొన్నారు.

లైఫ్‌టైమ్ అవార్డు జిల్లా వాసికి రావడం గర్వకారణం



నవతెలంగాణ - రెబ్బెన

మండలంలో ప్రతిష్టాత్మక లైఫ్‌టైమ్ అవార్డు కాగజ్‌నగర్‌కు చెందిన రాచకొండ నాగేశ్వర్‌రావుకు రావడం జిల్లాకు గర్వకారణమని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గుల్బం చక్రపాణి అన్నారు. గురువారం గోలేటిలో నిర్వహించిన సమావేశంలో చక్రపాణి మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు కలిపి 1994 నుండి వాసవి గ్రూప్ ద్వారా సామాజిక సేవా దృక్పథంతో పనిచేస్తున్న ఆర్యవైశ్యులకు ప్రతిష్టాత్మకంగా ఇస్తున్న లైమ్‌లైట్ అవార్డు ఆన్‌లైన్ ద్వారా ఓటింగ్ నిర్వహించారని, ఓటింగ్‌లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 65 మంది పాల్గొని కాగజ్‌నగర్‌కు చెందిన రాచకొండ నాగేశ్వర్‌రావు మూడు వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా అవార్డు అందుకున్న నాగేశ్వర్‌రావును జిల్లా ఆర్యవైశ్య సంఘం తరపున అభినందనలు తెలియజేశారు. అవార్డును అందించిన వాసవి గ్రూప్ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్, కోశాధికారి మైలారపు సుగుణాకర్ పాల్గొన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్నాక విజయకుమార్ ఆధ్వర్యంలో శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించిన ముఖర్జీ ఆధునిక హిందుత్వ, హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా విశ్వసించాడన్నారు. హిందూ మహాసభ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడైన ఆయన జనసంఘ్‌ను స్థాపించి దేశంలో తొలి హిందూవాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం పొందాడన్నారు. ఆర్టికల్ 370ని వ్యతిరేకించాడని ఆయన ఆశయాల కనుగుణంగా మోడీ రద్దు చేసి ఆయనకు ఘన నివాళులు అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్, బిసి మోర్చా జిల్లా నాయకులు కొత్రంగే సాగర్, కోదిరిపాక కమలాకర్, బిజెపి నాయకులు కుమురం తిరుపతి, నాని పాల్గొన్నారు.

రెబ్బెన : మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో శుక్రవారం శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆజ్మీర ఆత్మారాం నాయక్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన శ్యాంప్రసాద్ గొప్పతనం గురించి వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

చింతలమానేపల్లి : జనసంఘ్ వ్యవస్థాపకులు డా.శ్యామ్‌ప్రసాద్ ముఖర్జి బలిదాన్ దివాస్ సందర్భంగా బీజేపీ మండల ఉపాధ్యక్షులు పురుషోత్తమచారి అధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో శ్రీమాన్ నారాయణ, ఇప్ప మలేష్, పుంజరి ఓం, చెనగారపు మల్లేష్, దంద్రే నారాయణ, పొట్టే సాయి పాల్గొన్నారు.

బెజ్జూర్: మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు జాడి దిగంబర్, నాయకులు బాలకృష్ణ, తాళ్ల రామయ్య వసీవుల్లా ఖాన్, ఉమ్మెర లింగయ్య, తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

శిక్షకుల కోసం దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ - రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలో సింగరేణి సేవా సమితి ద్వారా ప్రభావిత ప్రాంతాల సింగరేణి ఉద్యోగుల కుటుంబీకులైన మహిళలు, యువతులకు ఇచ్చే వివిధ వృత్తి శిక్షణల కోసం శిక్షకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి దేవేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, క్లాత్ జూట్ బంజార బ్యాగ్, బ్రైడల్ మేకప్ కోర్సుల్లో శిక్షకులుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన వారు పాస్ ఫోటోలు, విద్యార్హత సర్టిఫికేట్, సంబంధిత కోర్సు సర్టిఫికేట్, ఆధార్‌కార్డు జిరాక్స్, పని అనుభవం ధృవీకరణ పత్రాలతో బెల్లంపల్లి, కాగజ్‌నగర్, మాదారం, గోలేటి సమీప గ్రామాలకు చెందిన వారు దరఖాస్తులను ఈ నెల 29వ తేదీన సాయంత్రం 5 గంటలలోపు జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంటులో అందజేయాలని కోరారు.

ఎన్నాండ్లీ జాప్యం..!

- మన ఊరు- మన బడి నిర్మాణాల్లో తీవ్ర జాప్యం
- ఏడాది గడిచినా కొలిక్కిరాని నిర్మాణాలు
- నిధుల లేమి..పర్యవేక్షణ లోపంతో అవస్థలు
- రెండో విడత బడుల ఎంపికకు అవాంతరాలు

సర్కారు బడుల్లో సకల హంగులు కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన మన ఊరు- మనబడి పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. పనులు ప్రారంభించి ఏడాది గడిచినా నిర్మాణాలు కొలిక్కిరావడం లేదు. నిధుల లేమి..పర్యవేక్షణ లోపం కారణంగా నత్తనడకన సాగుతున్నాయి. ఫలితంగా నూతన విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులకు ఆధునాతన సౌకర్యాలు అందుబాటులోకి రాలేకపోతున్నాయి. ఏడాదిలోపు పూర్తిచేయాలని ఉన్నతాధికారులు, విద్యాశాఖ అధికారులు పలుమార్లు సమీక్షలు చేపట్టి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా నిర్మాణాలు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారాయి. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడం..పనులు చేపట్టిన గుత్తేదారుల నిర్లక్ష్యం..విద్యాశాఖ అధికారుల అలసత్వం కారణంగా మన బడి పనులు పూర్తికావడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం నిపాని ప్రాథమికోన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇక్కడ సరిపడా గదులు లేక గ్రామ పంచాయతీ భవనంలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. కిందటేడాది చేపట్టిన నిర్మాణాలు విద్యా సంవత్సరం ముగిసినా పూర్తికావడం లేదు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తిప్పలు పడాల్సి వస్తోంది.





నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణాలు ఇవి. కిందటేడాది చేపట్టిన ఈ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనా కొత్త తరగతి గదులు విద్యార్థులకు అందుబాటులోకి రాలేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది.ఇలా ఉమ్మడి జిల్లా పరిధిలోని అనేక బడుల నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడుల్లో సౌకర్యాలు కల్పించడంతో పాటు ఆధునాతన హంగులు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మన ఊరు- మనబడి కార్యక్రమానికి అంకురార్పణ చేసింది. ఇందుకు రాష్ట్ర వ్యాప్తంగా రూ.7వేల కోట్లపైగా నిధులు కేటాయించింది. ఒక్కో జిల్లాలో తొలి విడతలో 30శాతం బడులను 12 అంశాల్లో మెరుగుపర్చాలని సూచించింది. తరగతిగదులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం, డ్యూయెల్‌డెస్కులు, గ్రీన్‌చాక్‌బోర్డులు, మరుగుదొడ్లు, ప్రహరీగోడలు తదితర తదితర వాటిని సమకూర్చి కార్పొరేట్ తరహాల్లో సర్కారు పాఠశాలలను అభివృద్ధి చేయాలని ఆదేశించింది. ఇందుకు టెండర్లు పూర్తిచేసిన అధికారులు పనులు ప్రారంభించింది.

ఉమ్మడి జిల్లాలో 3371 సర్కారు బడులు ఉండగా ఇందులో మన ఊరు- మన బడి కింద తొలి విడతలో 996 పాఠశాలను ఎంపిక చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం నాటికి పనులన్ని పూర్తిచేయాల్సి ఉండగా ఇప్పటికీ సగం బడుల్లో అసంపూర్తిగానే కనిపించడం విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఉన్నతాధికారులు వేసవి సెలవుల్లోనే పూర్తిచేయాలని పలుమార్లు ఆదేశాలు జారీ చేసినా కింది స్థాయి అధికారులు, గుత్తేదారుల నిర్లక్ష్యం కారణంగా పనుల్లో తీవ్ర జాప్యం చోటుచేసుకుందనే ఆరోపణలున్నాయి.

ఎప్పటికి పూర్తయ్యేనో..?

ఉమ్మడి జిల్లాలో చేపట్టిన మన ఊరు- మన బడి..మన బస్తీ పనులు ఇప్పట్లో పూర్తికావడం గగనంగానే మారింది. టెండర్ ద్వారా గుత్తేదారులు చేపట్టిన పనులతో పాటు ఉపాధిహామీ ద్వారా చేపట్టిన పనుల్లోనూ తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. రూ.30లక్షలకు పైగా నిధులతో చేపట్టే పనులను గుత్తేదారులకు అప్పగించగా.. రూ.30లక్షలకు తక్కువ నిధులతో చేపట్టిన వాటిని ఎస్‌ఎంసీలకు అప్పగించారు. ఇప్పటి వరకు ఆదిలాబాద్ జిల్లాలో 237 బడుల్లో కేవలం 87మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉందని తెలుస్తోంది. కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడంతోనే పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది మార్చి 31వ తేదీలోపల బిల్లులు సమర్పించిన వారివి మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని.. ఆ తర్వాత సమర్పించిన వాటివి నిధులు మంజూరుకావడం లేదు. దీంతో నిధులు రావడం లేదనే కారణంతో గుత్తేదారులు పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం..గుత్తేదారుల మధ్య సర్కారు బడుల్లో చదివే పేద విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. కొత్త విద్యా సంవత్సరంలో కొత్త సౌకర్యాలు ఉంటాయని ఆశపడిన పేద విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. ఓవైపు బడిబాటతో ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రవేశాలు పెంచుతుంటే..మరోవైపు బడుల్లో సౌకర్యాలు సకాలంలో కల్పించడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి.

త్వరలోనే పనులు పూర్తిచేస్తాం : టి.ప్రణీత, జిల్లా విద్యాశాఖాధికారి, ఆదిలాబాద్



జిల్లాలో మన ఊరు- మన బడి పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు సుమారు 87వరకు పూర్తయ్యాయి. మిగితా వాటిలో పనులు కొంచెం నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో వేగం పెంచి రెండు నెలల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటాం.

మండలాన్ని అగ్రస్థానంలో నిలపాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు
- నవతెలంగాణ కథనంతో మిషన్ భగీరథ అధికారులపై ఫైర్



నవతెలంగాణ - జైనూర్

అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి మండలంలోని సమస్యలను పరిష్కరిస్తూ మండలాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, ఎంపీపీ కుమ్రం తిరుమల విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కుమ్రం తిరుమల అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా వ్యవసాయ శాఖ అధికారి తమ నివేదికను చదువుతూ ప్రభుత్వం నుండి రైతులకు వస్తున్న పథకాలపై వివరించారు. సీడీపీఓ ఇందిరా మాట్లాడుతుండగా కోడిగుడ్లు తక్కువ సైజులో వస్తున్నట్లు ప్రజా ప్రతినిధులు ప్రశ్నించారు. ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం బాలింతలకు, గర్భిణులకు అందించాలని తెలిపారు. ఐకేపీ ఏపీఎం సుజాత మాట్లాడుతూ మండలంలో మహిళా సంఘాలకు ప్రత్యేకంగా రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జంగాం, ఉషేగావ్ గ్రామాల్లో ఓజా కుటుంబాలకు ప్రత్యేకంగా గతంలో శిక్షణ ఇచ్చామని, దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందారని పేర్కొన్నారు. పంచాయతీ శాఖ ఏఈఈ ధర్మేందర్ తమ నివేదికలో చింతకర్ర వంతెన పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ ఏఈ కలీల్ మాట్లాడుతూ మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నల్లా కనెక్షన్ కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యాశాఖ అధికారి కుడిమెత సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం హాజరయ్యేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉచిత పాఠ్య పుస్తకాలను దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. ఐటీడీఏ, ఏటీడబ్ల్యుఓ పురుషోత్తం మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని ఆశ్రమ పాఠశాలలో ఈ సంవత్సరం విద్యార్థులకు హాజరు శాఖ వంద శాతం అయ్యేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నవతెలంగాణ కథనంపై చర్చ

పాట్నాపూర్ గ్రామంలో నీటి సమస్య ఉందని, దీనికి మిషన్ భగీరథ వైఫల్యమే కారణమని ఇటీవల నవతెలంగాణలో కథనం ప్రచురితమైంది. దీంతో సంబంధిత అధికారులపై జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించి ప్రజలకు నీటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. మంచినీటి కోసం బావిలో పూడికతీసిన గ్రామస్తులను, సర్పంచ్‌ను అభినందించారు. త్వరలోనే అక్కడున్న సమస్యలను పరిష్కరించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ కొడప హన్నూపటేల్, వైస్ ఎంపీపీ చిర్లె లక్ష్మణ్ యాదవ్, ఎంపీటీసీలు కుమ్రం భగవంత్‌రావు, ఆత్రం జుగాజీరావు, బీబీనూర్, ఎంపీడీఓ ప్రభుదయ, తహసీల్దార్ సమీర్, ఎంఈఓ కుడిమెత సుధాకర్, సర్పంచ్‌లు మెస్రం పార్వతి లక్ష్మణ్, కనక ప్రతిభ వెంకటేశ్, కందారె బాలాజీ, గుణాజీ, మెస్రం రాహుల్, వడాయి భీంరావు, మెస్రం గోవింద్‌రావు, ఆత్రం సరోజ శంకర్, జాదవ్ దురీబాయి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-నస్పూర్

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీఎం బి.సంజీవరెడ్డి అన్నారు. స్వచ్ఛత పఖ్వాడాలో భాగంగా శుక్రవారం నస్పూర్ కాలనీ డిస్పెన్సరీలో నిర్వహించిన స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమంలో మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని గనులు విభాగాలలో స్వచ్ఛ పక్వాడా కార్యక్రమాన్ని జూన్ 16 నుండి 30 వరకు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా నస్పూర్ డిస్పెన్సరీలో స్వచ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు అందరూ తప్పనిసరిగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా తమ చుట్టూ ఉన్న పరిసరాలను తమ కార్యాలయ ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచుకొని వ్యాధులకు గురికాకుండా చూసుకోవాలని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఉపన్యాస పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు జనరల్ మేనేజర్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డివైసిఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ మురళీధర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, పిట్ కార్యదర్శి రమేష్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి పని దినాలకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి సెలవులు ఓపెన్ స్కూల్ 10వ తరగతి వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్థిక సెలవులు మంజూరు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో డీఈఓ అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఓపెన్ స్కూల్(టాస్), పదవ తరగతి వార్షిక పరీక్షల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు (ఈఎల్) మంజూరు చేయాలని, దసరా సెలవుల్లో నిర్వహించిన ప్రత్యేక అవసరాలు గల పిల్లల సమ్మిళిత విద్య - ట్రైనింగ్ కార్యక్రమానికి సంబంధించి శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు నిబంధనల ప్రకారం సెలవులు కోల్పోయినట్లుగా భావించి సీసీఎల్‌లు మంజూరు చేయాలని కోరారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న రెగ్యులరైజేషన్‌కి సంబంధించి ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. దీనికి జిల్లా విద్యాధికారి స్పందించి వెంటనే ఈఎల్ లకు సంబంధించిన ప్రొసీడింగ్ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తంగడిపల్లి రమేష్, తులసిరామ్, జాదవ్ సుభాష్, ప్రశాంత్, హరీష్, రాజలింగు పాల్గొన్నారు.

ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వం సరఫరా చేసిన ట్యాబ్‌లను ప్రధానోపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కెరమెరి మండలంలోని 50 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అదనపు కలెక్టర్, డీఈఓ అశోక్ చేతుల మీదుగా ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్యాబ్‌ల సాయంతో పాఠశాలల్లో జరిగే వివిధ కార్యక్రమాలైన విద్యార్థుల వివరాల నమోదు, పరీక్షల మార్కుల వివరాల నమోదు, ఎఫ్ఎల్ఎన్ తొలిమెట్టు మొదలగు కార్యక్రమాల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. ట్యాబ్‌లను సక్రమంగా వినియోగించి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి ఆడే ప్రకాష్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

అనారోగ్యానికి గురి కాకుండా ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని మంచిర్యాల పట్టణానికి చెందిన శ్రీహర ఆసుపత్రి వైద్యులు దుర్గం వినోద్ సూచించారు. శివ్వారం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆవిడపు గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరం ద్వారా గ్రామానికి చెందిన 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రధానంగా గుండె సంబంధిత పరీక్షలు (ఈసీజీ), డయాబెటీస్, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనారోగ్య లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా వ్యాధి ముదురకుండా నిరోదించడానికి వైద్యుల సలహా మేరకు మందులు వాడటం మంచిదని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆవిడపు గణేష్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, శ్రీహర ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీపై వచ్చిన అధికారికి సన్మానం

నవతెలంగాణ-నస్పూర్



బెల్లంపల్లి రీజియన్ (సేఫ్టీ)జీఎం గా కేహెచ్‌ఎన్ గుప్తా బాధ్యతలు స్వీకరించి శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చిన సందర్భంగా ఆర్ కే 7 గ్రూప్ ఏజెంట్ కార్యాలయంలో శుక్రవారం ఏజెంట్ మాలోతి రాముడు, ఆర్‌కే-7 గని మేనేజర్ సాయిప్రసాద్, ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ స్వామి రాజు ఘనంగా సన్మానించారు. బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం గుప్తా మాట్లాడుతూ ఆర్కే-7 గ్రూప్ అధికారులు ఆప్యాయంగా ఆహ్వానించి సన్మానించడం చాలా సంతోషకరంగా ఉందన్నారు. కార్మికుల రక్షణలో రాజీ పడకూడదని రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించే విధంగా ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రమాదరహిత గనులుగా ఆర్కే-7 గని మరియు ఆర్కే న్యూ టెక్ గనులు సింగరేణి సంస్థలో పేరు తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రీజియన్ డీజీఎం(ఈఅండ్ఎం) ఎం. రామనాథ్, రక్షణ అధికారి రవిశంకర్, ఫిట్ ఇంజనీర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ కార్యక్రమం

నవతెలంగాణ - రెబ్బెన

మండలంలోని గోలేటి టౌన్‌షిప్‌లో శుక్రవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆజ్మీర ఆత్మారాం నాయక్ పాల్గొన్నారు. ఇంటింటికి పోస్టర్లను అంటిస్తూ నరేంద్రమోడీ నాయకత్వంలో తీసుకొచ్చిన పథకాలను ప్రజలకు తెలియజేస్తూ వారిలో చైతన్యం నింపారు. అదేవిధంగా బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికి తెలియజేశారు. కార్యక్రమంలో గోలేటి టౌన్ అధ్యక్షుడు బత్తిని రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్, అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్‌తో నిరసన తెలిపిన దివ్యాంగులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో దివ్యాంగులు వివిధ రకాలుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం దివ్యాంగులు కలెక్టరేట్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి నిరసన తెలిపారు. దివ్యాంగుల కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి దివ్యాంగుడికి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శి ఫైసల్ అహ్మద్, అసరాఫ్ ఖాన్, రితిక్, ఫెరోజ్, జ్యోతి పాల్గొన్నారు.

కురిసిన వర్షం..మురిసిన రైతు

నవతెలంగాణ-తాంసి

జూన్ మాసంలో రైతులు తమ పంట పొలాలను చదును చేసుకొని పత్తి విత్తనాలు విత్తుకున్నారు. అప్పటి నుంచి వర్షం కోసం ఆకాశం వైపు ఎదురు చూసిన రైతన్నలకు శుక్రవారం రోజున కురిన వర్షంతో రైతు మురిసి పోయారు. జూన్ మొదటి వారంలో తాంసి, భీంపూర్ మండలాల్లో దాదాపు 75శాతం రైతులు పత్తి విత్తనాలు విత్తుకున్నారు. కురిసిన వర్షంతో మిగతా రైతులు విత్తనాలు పెట్టడానికి ఆనందం వ్యక్తం చేశారు. ఇలాగే వర్షాలు కురిస్తే పెట్టిన విత్తనాలు రైతుకు నష్టం కలగకుండా మొలకెత్తడానికి ఎంతో ఉపయోగ పడతాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తాంసి మండల కేంద్రం భారీవర్షం కురియడంతో రైతులలు ఆనందం వ్యక్తం చేశారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

నవతెలంగాణ-తలమడుగు

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఉండం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండం రైల్వే స్టేషన్ ప్రాంతంలో గత ఐదు రోజుల కింద అనుమానస్పదంగా వ్యక్తి మృతి చెందినట్టు తెలిపారు. శుక్ర వారం విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చూశారు. చిరునామా తెలియడంతో సంబంధిత సెల్ నెంబర్లకు ఫోను చేసి విషయాన్ని తెలిపి వివరాలు తెలుసుకున్నారు. మృతుడు మహారాష్ట్రలోని బోదిడి గ్రామానికి చెందిన సంజీవ్(44) ఆదిలాబాద్‌కు చెందిన భార్య తల్లి గారి ఇంట్లో ఉండటంతో ప్రతిరోజు మద్యం సేవించి రైలులో తిరుగుతుండేవాడని తెలిపారు. భార్య గత కొద్ది నెలల నుండి తల్లిగారి ఇంట్లో ఉండటంతో మద్యానికి బానిసైనట్టు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుమానస్పదంగా మృతి చెందినట్టు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

గడపగడపకు కాంగ్రెస్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మండలంలోని టెకిడిగూడ, చించుఘాట్, న్యూచించుఘాట్, గ్రామాల్లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు రైతు డిక్లరేషన్‌ను, యూత్ డిక్లరేషన్‌ను వివరించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువస్తే వరంగల్ రైతు డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా రైతులకు ఏకకాలంలో రూ.2లక్షలు రైతు రుణమాఫీ మంజూరు చేస్తామని అన్నారు. రైతులకు ఎకరాకు రూ.15వేలు రైతుబంధు ఇస్తామని ప్రతి ఆడబిడ్డకు రూ.500 వంట గ్యాస్ సిలిండర్ ఇప్పిస్తామని అన్నారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే రూ.5వేలు పెన్షన్ ఇప్పిస్తామని అన్నారు. సొంత ఇల్లుకు రూ.5లక్షలతో ఇంటి నిర్మాణం కేటాయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గంద్రత్ సుజాత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంజీవ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బలిదాన్ దివస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అందరికీ ఒకే చట్టం ఒకే న్యాయం వర్తింపజేయాలని, సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా జిల్లా కార్యాలయంలో బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించి, శ్యామ ప్రసాద్ ముఖర్జీకి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పాయల శంకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం కాశ్మీర్‌కు ప్రత్యేక స్వయం పాలనా అధికారాలను కట్టబెడుతూ ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టిందనీ, దీనికి వ్యతిరేకంగా గలమెత్తి, అక్కడి ప్రజలను ఏకతాటిపై తెచ్చిన మహనీయుడు శ్యామ ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. ఏక్ దేశ్ మే దో నిషాన్ దో ప్రధాన్ దో విధాన్ నహీ చలేగా అంటూ నినదించి తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుడు అని గుర్తు చేశారు. ఆయనకు నిజమైన నివాళిని భారతీయ జనతా పార్టీ ఇచ్చిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పట్టణ నాయకులు లాలా మున్నా, వేణు గోపాల్, అధినాథ్, రఘుపతి, జోగు రవి, గంగారెడ్డి, విజయ్, సతీష్, రాకేష్, ముకుంద్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారమే లక్ష్యంగా పని చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

దేశంలో నెలకొన్న వివిధ సమస్యలకు భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పరిష్కార మార్గాలను చూపించిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి అన్నారు. బీజేపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహాజన్ సంపర్క్ అభియాన్ లో భాగంగ ఇంటింటికీ బీజేపీ అనే నినాదంతో శుక్రవారం కైలాష్ నగర్ (బూత్ నెంబర్ 161) కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను పేదలకు అనుసంధానం చేసిన ఘనత మోడీకి దక్కుతుందని, గతంలో కేవలం పెద్దలకే అనే అభిప్రాయాన్ని తొలగించి 48 కోట్ల జన్ దన్ ఖాతాలు అందించారని అన్నారు. అలాగే కరోనా సమయంలో దాదాపు 80 కోట్ల మందికి ప్రధాన మంత్రి యోజన ద్వారా రేషన్ పంపిణీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్త బీజేపీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యతను భుజాన వేసుకోవాలని సూచించారు తెలంగాణలో బీజేపీ అధికారం సాధించడమే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట నాయకులు రాకేష్, పవన్, కాంత, రమేష్, భాగ్యలక్ష్మి, విజయ్ గన్నోజి, వెంకట్ రెడ్డి, ప్రశాంత్, పవన్ ఉన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-బోథ్

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యకు కృషి చేయని, విద్యాధికారులు ప్రయివేట్ పాఠశాలలకు బానిసలుగా మారుతున్నారని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుమేర్ పాషా అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలోని అధికారులకు వినతిపత్రం అందజేయడానికి వెళ్లిన నాయకులు కార్యాలయంలో ఎవరు లేకపోవడంతో గోడకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలు అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డిమాండ్ చేస్తోందని అన్నారు. గురువారం మండలంలోని పొచ్చెర సెయింట్ థామస్ పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను అమ్మడమే కాక అధిక ధరలకు అమ్ముతుందని ఏఐఎస్ఎఫ్ నాయకులు జిల్లా విద్యాధికారికి, మండల విద్యాధికారికి తెలియజేశారు. పరిశీలిస్తామని హామీ ఇచ్చిన అధికారులు ఇప్పటికీ ఏలాంటి ఎంక్వయిరీ కూడా చేయలేదని అన్నారు. ఏది ఏమైనా నిబంధనలకు వ్యతిరేకంగా పుస్తకాలను అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకునేంతవరకు ఏఐఎస్ఎఫ్ పోరాడుతూనే ఉంటుందనీ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్, మున్సిఫ్ పాల్గొన్నారు.

అనుమతులు లేని పారామెడికల్ కళాశాలపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మావల మండల కేంద్రంలో అనుమతులు లేని పారా మెడికల్ సైన్స్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మేస్రం భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ కార్యాలయంలో అధికారులకు కళాశాలపై ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ మావల మండలంలోని ప్రభుత్వ ఆరోగ్యశాఖ వారి అనుమతులు లేకుండా పారామెడికల్ కళాశాల నడుపుతున్నారని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అమాయక విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుతున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి కళాశాల యాజమాన్యంపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో అఖిల భారత యువజన సమైక్య జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బుర్రి కిరణ్, పెందుర్ దిలీప్, సాగర్, అశోక్, యోగరాజ్, మడవి గణేష్ పాల్గొన్నారు.

వర్షం కరిసింది.. నేల మురిసింది..!

● పచ్చిరొట్టకు ప్రాణం పోసిన వాన



నవతెలంగాణ- ఖానాపూర్‌టౌన్

మండలంలో శుక్రవారం కురిసిన వర్షం పచ్చిరొట్ట వేసుకున్న రైతులకు ఎంతో మేలు చేసింది. మండలంలో 3వేల 366 ఎకరాల్లో రైతులు పచ్చి రొట్ట విత్తనాలు చల్లుకున్నారు. నేల సారవంతం కోసం 15 రోజుల క్రితం చదును చేసుకొని ఎండు దుక్కి సాల్లలో పచ్చి రొట్ట విత్తనాలను చల్లుకోగా అప్పటి నుంచి వర్షం రాలేదు. దీంతో విత్తనాలు మొలకెత్తని పరిస్థితి నెలకొని రైతులు ఆందోళన చెందారు. తాజాగా గురువారం తెల్లవారుజామున మండలంలోని పలుచోట్ల దుక్కి తడిసేటంత వర్షం రావడంతో పచ్చిరొట్ట విత్తనానికి ప్రాణం పోసినట్లచేసింది. చల్లిన విత్తనం మొలకెత్తక నష్టపోతామని ఆందోళన చెందిన రైతులకు ఈ వర్షం సంతోషాన్ని నింపింది.

వర్షం పడకుంటే నష్టం జరిగేది



నేను 10 ఎకరాల దుక్కిలో 4 బస్తాల పచ్చిరొట్ట విత్తనాలను చల్లుకున్నాను. పదిహేను రోజులనుంచి వర్షం పడక విత్తనం మొలకెత్తలేదు. సమయం దాటుతుందని భయపడ్డాను. తాజాగా వర్షం కురవడం చాలా మేలు చేసింది.

గుమ్ముల రాజేందర్, రైతు

నేల చల్లబడేదాకా పంటలు వేయకూడదు

అక్కడక్కడ కురిసిన తేలిక పాటి వర్షానికి రైతులు తొందరపడి పంటలు వేయకూడదు. నేల చల్లబడే స్థాయిలో వర్షం కురిసే వరకు ఆగాలి. రైతులు పత్తి, పసుపు, మొక్కజొన్న పంటలు వేసుకోవాలి. వాతావరణం చల్లబడితేనే పంటలు మొలకెత్తే అవకాశం ఉంటుంది. తొందరపడి పంటలు వేసుకుంటే నష్టపోతారు.

ఆసం రవి, ఏఓ, ఖానాపూర్

ఆర్జీయూకేటీకి తగ్గిన దరఖాస్తులు

- 1605 సీట్లకు 13,538 దరఖాస్తులు
- జులై 3న ఎంపిక జాబితా విడుదల
- జులై 7న కౌన్సెలింగ్



నవతెలంగాణ-బాసర

నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో ప్రవేశాల దరఖాస్తులు భారీగా తగ్గాయి. గత సంవత్సరం 33 వేల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తులు సమర్పిస్తే ఈ సంవత్సరం 13,538 వేల మంది విద్యార్థులు దరఖాస్తులు సమర్పించినట్లు శుక్రవారం యూనివర్సిటీ డైరెక్టర్ సతీష్ కుమార్ తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి ఆర్జీయూకేటీ 1404 జనరల్ సీట్లు కాగా, 96 సీట్లు ప్రత్యేక కేటగిరిలైన స్పోర్ట్స్, దివ్యాంగులు, క్యాప్, ఎన్‌సీసీ కేటాయిస్తారు. గ్లోబల్ ఎన్నారై కోట సీట్లు 105 ఉన్నాయి. మొత్తంగా 1605 సీట్లకు గాను 13,538 దరఖాస్తులు సమర్పించారు. జులై 3న ఎంపికైన జాబితాను విడుదల చేసునున్నట్లు ఎంపికైన విద్యార్థులకు జులై 7 నుండి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డైరెక్టర్ తెలిపారు.

ఆర్జీయూకేటీ యూనివర్సిటీపై విద్యార్థులు తల్లిదండ్రుల విముఖత..

నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీ యూనివర్సిటీ ఏర్పాటైన నాటి నుండి ఈ సంవత్సరమే యూనివర్సిటీలో విద్యానభ్యాసించడానికి విద్యార్థులు విముఖత చూపిస్తున్నారు. యూనివర్సిటీ ప్రారంభంలో ఉన్న పోటీ ఇప్పుడు లేకపోవడంపై యూనివర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కొటొచ్చినట్లు కనపడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతా, ఆహారం, విద్యాపై ఉన్నతాధికారులు సరియైన పర్యవేక్షణ లేకపోవడంతోనే యూనివర్సిటీలో చదువు కోసం గణనీయంగా దరఖాస్తులు తగ్గాయని పలువురు అసహనం వ్యక్తం చేశారు. వరుసగా ఇద్దరు విద్యార్థినులు మృతి చెందడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు సైతం ఆర్జీయూకేటి వైపు మొగ్గు చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైన ప్రభుత్వం బాసర ఆర్జీయూకేటీపై దృష్టి సారించి, నిధులు విడుదల చేసి, రెగ్యులర్ వీసీ స్థానికంగా ఉండేటట్లు చూస్తే తప్ప ఆర్జీయూకేటి మెరుగు పడే స్థితిలో లేదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

దేశం కోసం ప్రాణాలర్పించిన బీజేపీ నాయకులు

● కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

నవతెలంగాణ-ఉట్నూర్

భారతదేశం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర బీజేపీ నాయకులదని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల వ్యాఖ్యనించారు. శుక్రవారం మండల కేంద్రంలో తిరుమల పంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా ఆయా విభాగాల మోర్చల సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల హాజరయ్యారు. బలిదాన్ దివస్ సందర్భంగా డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హాజరైన వివిధ మోర్చల నాయకులతో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రైతులకు పెద్దపీట వేశారని అన్నారు. పక్క ప్రణాళికతో రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. బీజేపీ మోర్చ నాయకులు పీఎం నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. తెలంగాణ రాక్షస పాలన కొనసాగుతుందని, రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. ఎన్నికలు ఎప్పుడచ్చిన బీజేపీ శ్రేణులు ఎన్నికలకు సిద్ధం కావాలని



సూచించారు. పార్టీ విభాగాల మోర్చల నాయకులకు పార్టీ బలోపేతం, తదితర అంశాలపై బీజేపీ నాయకులు ఆల్లాపూర్ శ్రీనివాస్, రమేష్ రాథోడ్, పాయల్ శంకర్, అయ్యన్నగారి భూమన్న దిశానిర్దేశం చేశారు. అనంతరం కేంద్రమంత్రికి పార్టీ నాయకులు సన్మానించారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు ఉన్నారు.

అధికారుల గైర్హాజరు పట్ల ప్రజాప్రతినిధుల ఆగ్రహం



నవతెలంగాణ-తలమడుగు

ప్రతి మూడు నెలలకు ఒకసారి జరిగే సర్వసభ్య సమావేశాలకు సంబంధిత శాఖల అధికారులే హాజరు లేకపోతే సమావేశాలు ఎందుకు అంటూ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో నిర్వహించారు. ముందుగా ఎజెండా అంశాలు సంబంధిత శాఖ అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించగా, 18 శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాల్సి ఉండగా, కేవలం 9 శాఖల అధికారులు హాజరు కావడంతో గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ జిల్లా స్థాయి అధికారులకు ఉత్తర్వులు పంపాలని ఎంపీడీఓ రమాకాంత్‌ను కోరారు. అధికారులతో పాటు మండలంలో 28 గ్రామపంచాయతీ సర్పంచ్‌లు ఉండగా, కేవలం 7 మంది సర్పంచ్‌లు సమావేశానికి హాజరయ్యారు. ఎంపీటీసీలు 10 కాగా మండల ఉపాధ్యక్షురాలతో పాటు ముగ్గురు ఎంపీటీసీలే సమావేశానికి హాజరయ్యారు. ప్రజల సమస్యలపై అడిగేవారు లేకపోవడంతో మరింత సమస్యలు అపరిష్కృతంగానే మిగిలిపోతాయిని అన్నారు. సర్పంచ్ కళ్లెం కరుణాకర్‌రెడ్డి, చర్లపల్లి సర్పంచ్ బాలు, పలు శాఖల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. మండల కేంద్రంలో ఆర్ అండ్ బి శాఖ ద్వారా నిర్మించాల్సిన రోడ్డును సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డు నిర్మాణం విషయమై పలుమార్లు విన్నవించిన నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని అన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని అన్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించాలని కోరారు. వ్యవసాయ, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల అధికారుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల ఉపాధ్యక్షురాలు దివ్య, ఎంపీడీఓ రమాకాంత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అధికారులు అభివృద్ధే లక్ష్యంగా పని చేయాలి

● ఎంపీపీ అడ్వాల పద్మ రమేష్

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో అభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని అన్నారు. వర్ష కాలం సమీపించడంతో గ్రామల్లో పారిశుధ్య పనులు, పరిశుభ్రత పట్ల అవగాహనా కల్పించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించవద్దని అన్నారు. జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి ప్రయోజనల గురించి అధికారులు గ్రామాల్లో పర్యటించి అవగాహనా కల్పించాలని అన్నారు. తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు తెలిపారు. నకిలీ విత్తనాలు, పురుగు మందులు గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. మండలకేంద్రానికి జాతీయ ఉపాధి హామీ (ఈజీఎస్) పథకం కింద సీసీ రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు అయి రద్దు అవ్వడం, మరి కొన్ని గ్రామాలకు నిధులు కేటాయించడం లేదని స్థానిక సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ నర్సారెడ్డి, మునిపల్లి సర్పంచ్ కమలకోట్ పద్మ వెంకట్ రెడ్డి వేదిక దగ్గర బైటాయించి నిరసన



తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీఓ నసీరుద్దీన్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులు దృష్టి సారించాలని, ప్రజాప్రతినిధులు రైతులకు అవగాహనా కల్పించాలని ఏఓ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయా సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, ఎంపీడీఓ శేఖర్, ఎంపీఓ నసీరుద్దీన్, మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చోడలో ఉచిత శిక్షణ, జాబ్ మేళా

నవతెలంగాణ-సిరికొండ

యువతీ, యువకుల కోసం ఈ నెల 25న ఇచ్చోడ మండల కేంద్రంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో ఉచిత శిక్షణతో పాటు జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు 24హవర్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు విశ్వబోధి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిమ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత శిక్షణ, జాబ్ మేళా నిర్వహిస్తున్నామని తెలిపారు. నర్సింగ్, ఎలక్ట్రీషియన్, సోలార్, బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ తదితర కోర్సులలో ఉచిత శిక్షణతో పాటు ఉచిత భోజనం కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9381843617, 6303157527 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

సామాజిక సేవలు అభినందనీయం

నవతెలంగాణ-బోథ్

తుల వెల్ఫేర్ సోసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని, సేవ చేసిన వారికి గుర్తింపు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు సేవాలాల్ రాథోడ్, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి హరీష్ వర్ధన్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తుల అరుణ్ కుమార్‌ను తన సామాజిక సేవ కార్యక్రమాల ద్వారా ప్రజల మనసుల్లో మంచి సేవకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. తండ్రి దివంగత తుల సుభాష్ సోషల్ వెల్ఫేర్‌తో ముందుకు వెళ్తూ అలాగే అరుణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నందుకు ఆయనను సన్మానించి, పార్టీలోకి స్వాగతించారు. అలాగే పార్టీలో ఉంటూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించి, బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఈద్‌గాలో పారిశుధ్య పనులు

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఈ నెల 29న జరుగనున్న బక్రీద్ పండుగ నేపథ్యంలో స్థానిక ఈద్‌గాలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మెన్ ఖలీల్ కార్మికులతో పారిశుధ్య పనులు చేయించారు. పండుగ రోజు ప్రార్థన కోసం వచ్చే వారికి ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

దయానంద్ గైక్వాడ్ సేవలు మరువలేని

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంబేద్కర్ మెమోరియల్ మాజీ అధ్యక్షులు, సంవిధాన్ బచావ్ దేశ్ బచావ్ అధ్యక్షులు, కార్మిక సంఘం నాయకులు దయానంద్ గైక్వాడ్ సేవలు మరువలేనివని దళిత సంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో ఆయన వర్ధంతి సభను దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రానికి పుష్పాంజలి ఘటించారు. దళిత, కార్మికుల హక్కుల, సంక్షేమం కోసం దయానంద్ గైక్వాడ్ ఎన్నో పోరాటాలు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్యాల స్వామి, ఎల్లుల సంతోష్ కుమార్, మల్యాల మనోజ్, శైలందర్ వాగ్మారే, గణేష్ మెకానే, ప్రసన్న భీంరావ్, సుందరం బాబు, కత్తి గంగాధర్, నక్క రాందాస్, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ రాక ముందే బీసీ రుణాలు అందించాలి

నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్ర ఎన్నికల కోడ్ రాక ముందే దరఖాస్తు పెట్టుకున్న వారందరికి బీసీ రుణాలు అందించాలని జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎంబడి చంద్రశేఖర్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలో ఉన్న ఇతర కులాలవారికి బీసీ రుణాలు అందించాలని కోరారు. లేనిపక్షంలో ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహంతో ఉన్నారని వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వానికి ఒక్క ఓటు కూడా వేయరని అన్నారు. మరో వైపు ప్రతినెలా 15న నియోజక వర్గానికి 50 మందికి మాత్రమే బీసీ రుణాలు ఇస్తే, పెట్టుకున్న వంద శాతంలో 5శాతం మందికి మాత్రమే బీసీ రుణాలు వస్తాయని వెల్లడించారు. ప్రతినెలా 15న నియోజక వర్గానికి రెండు వేల మందికి బీసీ రుణాలు అందిస్తేనే అందరికి బీసీ రుణాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఒక వేళ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోడ్ వస్తే మళ్లీ 2018 పరిస్థితి ముందుకు వస్తుందని గుర్తుచేశారు.

పార్టీ బలోపేతానికి కృషి

నవతెలంగాణ-దిలావర్‌పూర్

బీజేపీ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని దళిత మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బర్కుంట నరేందర్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోనీ బీజేపీ పార్టీ కార్యాలయంలో డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి రాజేందర్, మండల ఉపాధ్యక్షుడు సవీన్, మండల కార్యదర్శి మహేష్, నాయకులు లక్ష్మణ్, సాయికృష్ణ, వార్డు సభ్యులు సాయికృష్ణ, రాజు, రాము, గంగాధర్, కాళిదాసు పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు కాంగ్రెస్‌కు లేదు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దేశంలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టడం కాంగ్రెస్ పార్టీ నాయకుల దృష్టిలో ద్రోహమా అని బీఆర్ఎస్ పార్టీ నాయకులు సాజిదోద్దీన్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఇటీవల జరిగిన నిరసనలో కాంగ్రెస్ నాయకులు తెలంగాణకు ద్రోహం జరుగుతుందంటూ మొసలి కన్నీరు కార్చారని మండిపడ్డారు. అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాల ఫలాలను అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు ఆ పార్టీ నాయకులకు లేదని అన్నారు. ఉద్యమ సమయంలో అప్పటి సీఎం కిరణ్ కుమార్‌రెడ్డికి వత్తాసు పలికిన కాంగ్రెస్ నాయకులు ప్రస్తుతం ద్రోహం గురించి మాట్లాడుతున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలు, దుష్ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి అష్రఫ్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు బుట్టి శివకుమార్, జంగిల్ ప్రశాంత్, రిజ్వాన్ పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి

నవతెలంగాణ-బాసర



బైక్ అదుపు తప్పి కింద పడి యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని బీదరెల్లి, ధర్మాబాద్ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీదరెల్లికి చెందిన కరకెల్లి కార్ మహేష్, లక్ష్మణ్ ఇద్దరు బైక్‌పై వస్తుండగా భారీగా వర్షం కురుస్తుంది. ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి కిందపడటంతో మహేష్ (26) అక్కడికక్కడే మృతి చెందగా, లక్ష్మణ్‌కు గాయాలయ్యాయి. లక్ష్మణ్‌ను చికిత్స నిమిత్తం బైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. హెల్మెట్ దరించకపోవడం మృతికి కారణంగా తెలుస్తుంది. మృతి చెందిన మహేష్‌కు భార్య కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవగాహన కార్యక్రమం



వేమనపల్లి : నీల్వాయి గ్రామ పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షణ్-2023 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ నమూనా పటం ద్వారా మౌలిక వసతులు, ప్రభుత్వ భవనాలు, నివాస ప్రాంతాలు ఇతర నిర్వహణ కార్యక్రమాలను వివరించే విధంగా ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం ఇంటింటి సర్వే చేపట్టి మరుగుదొడ్ల వినియోగం, ట్విన్ పిట్, ఇంకుడు గుంతల వివరాలు, కిచెన్ గార్డెన్, ఇంటి నుండి వెలువడిన మురుగు నీటి నిర్వహణ, ప్రభుత్వ భవనాలలో గల వసతులు వంటి అంశాలపై వివరాలను సేకరించి చార్ట్ రూపంలో పొందుపరిచారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మధు, ఎంపీడీఓ లక్ష్మయ్య, ఎంపీఓ శ్రీపతి బాపురావు, స్వచ్ఛ భారత్ మిషన్ కోఆర్డినేటర్ రాజేందర్, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 24 జూన్ 2023

ఉద్యోగ విరమణ పొందనున్న అధికారికి సన్మానం



రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్‌లో హాలులో ఈ నెలలో పదవి విరమణ పొందనున్న వై గోపాల కృష్ణమూర్తి జీఎం(ఈఅండ్ఎం)(టీజీటీఎస్)ని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియా అధికారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. పూల బొకేను బహూకరించారు. ఈ సందర్భంగా జీఎంతో పాటు ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులు ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఓ జీఎం ఉమాకాంత్, ఏజీఎం తిరుమలరావు, డీజీఎం సతీష్‌బాబు, డీజీఎం ఎఫ్అండ్ఎ రామారావు, డీజీఎం(ఐఈడీ) ఉజ్వల్‌కుమార్ బెహెర, పర్సనల్ మేనేజర్ ఐ లక్ష్మణ్‌రావు, అన్ని విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కొనివ్వలేదని ఉరేసుకున్న యువకుడు

నవతెలంగాణ-జైపూర్



కిష్టాపూర్ గ్రామానికి చెందిన సుముద్రాల మహేశ్(19) శుక్రవారం కుమ్మరికుంట చెరువు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మంచిర్యాల పట్టణంలో గల శ్రీహర్ష కళాశాలలో డిగ్రీ 2వ సంవత్సరం చదువున్న మహేశ్ తండ్రి రాములను సెల్‌ఫోన్ కొనివ్వాలని కోరాడు. దానికి తండ్రి నిరాకరించాడు. ఈ క్రమంలో క్షణికావేశానికి లోనై మహేశ్ ఆత్మహత్యకు పాల్పడ్డట్టు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఉపాధ్యాయులను సన్మానించిన గ్రామస్తులు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కలమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందానికి గ్రామస్తులు శుక్రవారం ఆ పాఠశాలలో శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. మండలంలో పదవ తరగతి ఫలితాల్లో 10/10 జీపీఏ సాధించి, జిల్లా ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో జిల్లాలో పాఠశాలను మొదటి స్థానంలో నిలిపినందుకు పాఠశాల ఉపాధ్యాయులను సన్మానించామని ఆ గ్రామ సర్పంచ్ కార్తికరావు తెలిపారు. పాఠశాలలో ఎలాంటి అవసరాలు ఉన్న తమను సంప్రదించాలన్నారు. అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన చదువును నేర్పించి ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా వారికి ప్రోత్సాహకాన్ని అందించాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజగౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ కుమార్ , కార్యదర్శి వినోద్, ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్, ఎన్‌సిసి అధికారి కట్ట రాజమౌళి పాల్గొన్నారు.

ఎస్‌సీఆర్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ - హాజీపూర్

10వ తరగతి సాంఘికశాస్త్రం, తెలుగు, ఇంగ్లీష్ మీడియం పాఠ్య పుస్తకం కవర్ పేజీపై ముద్రించిన రాజ్యాంగ పీఠికలో సోషలిస్ట్, సెక్యులర్ పదాలు తొలగించి తప్పుగా ముద్రించిన ఎస్‌సీఈఆర్టీ అధికారులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొల్ల రామన్న, గుర్రాల రాజావేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఇది కావాలనే ముద్రించినట్టు కనిపిస్తుందని విమర్శించారు. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో ఈ రెండు పదాలను చేర్చారన్నారు. దేశంలో లౌకికతత్వానికి ప్రమాదం ఏర్పడిందని చర్చ జరుగుతున్న తరుణంలో ఇలాంటి చర్యలు అనుమానాలకు తావిస్తున్నాయని పేర్కొన్నారు. కొంతమేర అమలవుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ఆయా అంశాలను తొలగించాలనే ప్రయత్నంలో ఉన్న క్రమంలో ఆ భావజాలంతో ఉన్నవారు కావాలనే ముద్రించినట్టు భావించాల్సి వస్తుందని తెలిపారు. ప్రస్తుతం అమలులో లేని రాజ్యాంగ పీఠికను వేయడం రాజ్యాంగాన్ని అవమానపరచడమే అని అభిప్రాయపడ్డారు. ఇది ఒక ఆటవిక చర్యగా భావిస్తున్నామన్నారు.

ఉద్యోగ విరమణ కాబోతున్న అధికారులకు సన్మానం

నవతెలంగాణ-మందమర్రి

ఈ నెలలో పదవి విరమణ చేయబోతున్న ఉద్యోగులను గోవర్ధన్‌రెడ్డి జీఎం సర్వే కార్పొరేట్, వై గోపాలకృష్ణమూర్తి జీఎం ఈఅండ్ఎం ఓసిపి సిఎస్‌లను ఏరియా జనరల్ మేనేజర్ జి మోహన్‌రెడ్డి, జీఎం ఆఫీస్ హెచ్ఒడిలు ఘనంగా సన్మానించారు. ఏరియాలో శుక్రవారం పర్యటించిన జీఎం సర్వే కార్పొరేట్ గోవర్ధన్‌రెడ్డి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా సర్వే ఆఫీసర్ ఉజ్వల్ బందోపాధ్యాయ, కెకె ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఏఎస్ఓ రవీందర్, కెకె గ్రూప్ ఏజెంట్ రాందాస్, ఎస్కె గ్రూప్ ఏజెంట్ విజయకుమార్, కాసిపేట గ్రూప్ ఏజెంట్ రాజేందర్, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డిజీఎం(ఐఈడి) రాజన్న, డిజీఎం పర్చేస్ సురేష్ పాల్గొన్నారు.

బాబేఝరి జీపీ భవనానికి భూమి పూజ



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని బాబేఝరి గ్రామంలో మంజూరైన నూతన గ్రామ పంచాయతీ భవనానికి శుక్రవారం ఎంపీపీ పెందూర్ మోతీరాం భూమి పూజ చేశారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పాలన పరంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఏర్పాటు చేసిన కొత్త గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మానిక్‌రావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ రోహిత్, గ్రామస్తులు సుభాష్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

నవతెలంగాణ - కౌటాల

మండల కేంద్రంలోని సదాశివపేట ఇండియన్ పెట్రోల్‌పంప్ వెనకాల గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు శుక్రవారం ఉదయం నదీమాబాద్ ప్రాంతానికి చెందిన కామ్రె ఆత్మారాం ఆవు తగిలి మృతి చెందింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం మేతకు వెళ్లిన ఆవు రాలేదని, అంతలోనే ఎవరిదో ఆవు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతి చెందిందని స్థానికులు తెలపడంతో అక్కడికి వెళ్లి చూశాడు. ఆవు విద్యుత్ షాక్ తగిలి మృతి చెందినట్టు గుర్తించాడు. ఇదే ట్రాన్స్‌ఫార్మర్‌కు గతంలో ఒక గేదె, ఒక ఆవు తగిలి మృతి చెందాయి. ట్రాన్స్‌ఫార్మర్ తక్కువ ఎత్తులో ఉండడం, దాని చుట్టూ కంచె లేకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నట్టు స్థానికులు తెలిపారు.

కిర్డీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి

వాంకిడి: మండలంలోని కిర్డీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు దుర్గం దినకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనేకసార్లు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతిపత్రాలు అందజేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. గ్రామానికి వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైన ఇప్పటివరకు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించలేదని, ఈ వర్షాకాలంలోనైనా రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

పోరాటం చేస్తున్న పేదల పట్ల నిర్లక్ష్యం తగదు

- తల దాచుకోవడానికి ఇంటి స్థలం ఇవ్వాలనడం తప్పా?
- గుడిసెలు వేసుకున్న స్థలాలనే ఇంటి స్థలాలుగా కేటాయించాలి
- ఆటపాటలతో చెన్నూర్ పట్టణ వీధుల మీదుగా ప్రజా సంఘాల పోరాట వేదిక బస్సు యాత్ర

నవతెలంగాణ-జైపూర్



ఇంటి స్థలం ఇవ్వాలని పోరాడుతున్న పేద కుటుంబాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇల్లు, ఇంటి స్థలాలు, డబుల్ బెడ్‌రూం ఇండ్ల సాధన కోసం బయలుదేరిన బస్సు యాత్ర బృందం శుక్రవారం చెన్నూర్ మండలం బావురావుపేట్‌కు చేరింది. బావురావుపేట్ భూపోరాటానికి మద్దతుగా వచ్చిన బస్సు యాత్రకు వందలాదిగా తరలివచ్చిన మహిళలు పట్టణంలోని రాగి చెట్టు వద్ద ఘనంగా స్వాగతం పలికారు. బోనమెత్తిన మహిళలతో పాటు బతుకమ్మ, కోలాటం ఆటలతో గాంధీచౌక్, పాత బస్టాండ్ మీదుగా బావురావుపేట్ భూపోరాట వేదిక వరకు బస్సు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బస్సుయాత్ర బృందం కన్వీనర్ ఎస్.వీరయ్య, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, వృత్తి సంఘాల రాష్ట్ర కన్వీనర్ పైళ్ల ఆశయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ పేదలను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో సొంత ఇల్లులేని ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ కులాల వారు అద్దె ఇండ్లలో కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉండటానికి ఇల్లులేక చేతిలో పని లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు ఇంటి స్థలాల కోసం పోరాటం చేస్తున్నారని, పేదలు చేస్తున్న పోరాటానికి ప్రజా సంఘాల పోరాట వేదిక మద్దతు తెలుపుతోందని తెలిపారు. మహిళలు తలదాచుకోవడం కోసం ఇంటి స్థలం ఇవ్వనడం తప్పా అని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల జీవితాలతో దోబూచులాడుతున్నాయని విమ్మర్శించారు. ఎన్నికలప్పుడే పేదలు గుర్తుకొస్తారని, ఇంటి స్థలం ఇవ్వమని బావురావుపేట్‌లో రెండు నెలలుగా పోరాడుతున్న పేదలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. అదిరిస్తే బెదిరిస్తే పోరాటం ఆగుతుందని అనుకుంటే పొరపాటని, ఎంతటి నిర్బంధానికైనా పేదలు సిద్ధంగా ఉన్నారని, ఎన్ని అక్రమ కేసులు పెట్టుకున్నా..బైండోవర్లు చేసినా ఇంటి స్థలాలు సాధించే వరకు పేదల పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కబ్జాకోరులు, పలుకుబడిదారులు ప్రభుత్వ భూములను కొల్లగొడుతుంటే నిమ్మకు నీరెత్తినట్లు చూస్తుండిపోతున్న అధికారులు



న్యాయమైన డిమాండ్‌తో ఇంటి స్థలాల కోసం పోరాడుతున్న వారికి న్యాయం చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బస్సు యాత్రలో సభ్యులు కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు, వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షురాలు బొప్పని పద్మ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుగంటి వెంకటేశ్, సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ జగదీష్, ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు వేముల ఆనంద్, ముత్యాలు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు సంకె రవి, వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బోడెంకి చందు, జిల్లా కన్వీనర్ ఎండీ ఆవేజ్, సీఐటీయూ జిల్లా నాయకురాలు దాసరి రాజేశ్వరి, సీఐటీయూ జిల్లా సీనియర్ నాయకులు ప్రకాష్, గోమాస అశోక్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు ప్రేమ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్కె మోహన్, రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తంగళ్లపల్లి వెంకటేశ్, పావురాల రాములు, రాతిపల్లి నగేష్, ఇండ్ల స్థలాల పోరాట కమిటి నాయకులు కావేరి రవి, జక్కుల మారన్న, చంద్రన్న, పోసక్క, సమ్మక్క, కరీంబీ, ఉమారాణి, సంధ్య, మానక్క, భూదేవి, రాజేశ్వరి, నవీన్, రేణుక, ప్రజన్న, సాదిక్, రుక్సానా, బండారు రాజేశ్వరి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ అభివృద్ధి

- కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల

నవతెలంగాణ-జన్నారం



కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణ అభివృద్ధి చెందుతోందని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. 9 ఏండ్లు పూర్తి చేసుకున్న మోడీ ప్రభుత్వ విజయాలను ప్రజలల్లోకి తీసుకెళ్లడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా శుక్రవారం మండలంలో పర్యటించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బిజెపి జెండాను ఆవిష్కరించారు. పక్కనే ఉన్న వ్యాపార దుకాణాలలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ చొరవతో తెలంగాణ అభివృద్ధి చెందుతోందని తెలిపారు. ఆర్టికల్ 270 రద్దుతో కాశ్మీర్ కల్లోలం నుండి విముక్తి చెంది ప్రశాంతంగా ఉందన్నారు. ఇప్పుడు అక్కడ వ్యాపారం పుంజుకుందన్నారు. అలాగే తెలంగాణలో కూడా రానున్న రోజుల్లో బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, బిజెపి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి శ్రీనివాస్, ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు హరినాయక్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథరావు, పెంబి జడ్పిటిసి జానుబాయి, మండల అధ్యక్షుడు గోలి చందు, ఎంపీటీసీలు కొంతం శంకరయ్య, గుండవరపు హరిణి మధుసూదనరావు, వీరాచారి, సూర్యం, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఈ నెల 26న నిర్వహించి మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించాల్సిన కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని 26న జిల్లాలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి పాఠశాల, కళాశాలలో మాదకద్రవ్యాల వలన కలిగే నష్టాలపై విద్యార్థులకు వివరించాలన్నారు. జిల్లా కేంద్రంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించాలని తెలిపారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించాలని, మారుమూల గ్రామాలలో విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు అలవాటు పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈనెల 26న నిర్వహించే ర్యాలీ, అవగాహన కార్యక్రమాలలో జిల్లాస్థాయిలో జిల్లా అధికారులు, మండల స్థాయిలో ఆయా మండలాల అధికారులు పాల్గొనాలని తెలిపారు. మాదక నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, జిల్లాలో ఎక్కడైనా కనిపిస్తే ప్రజలు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివద్ధి అధికారి మణెమ్మ, జిల్లా సంక్షేమ అధికారి సావిత్రి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ అధికారి సజీవన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బీఎస్‌పీలో చేరిన బీఆర్ఎస్ వార్డుమెంబర్

నవతెలంగాణ - బెజ్జూర్



మండలంలోని సులుగుపెల్లి గ్రామానికి చెందిన వార్డుమెంబర్ దుర్గం అనసూర్య శుక్రవారం బహుజన సమాజ్ పార్టీలో చేరారు. ఆమెతో పాటు సోమిని, మొగవెల్లి గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు ఆత్రం శ్యాంరావు, గీత బీఎస్‌పీలో చేరారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యనిర్వాహక కమిటీ కార్యదర్శి అర్షద్ హుస్సేన్ బీఎస్‌పీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దుర్గం అనసూర్య మాట్లాడుతూ 9 ఏండ్ల బీఆర్ఎస్ పాలనలో తమ కాలనీకి ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, తన గ్రామానికి చెందిన తమ సామాజిక వర్గానికి రైతుబంధు, మూడెకరాల భూమి, డబుల్‌బెడ్‌రూం ఇండ్లు లాంటి పథకాలు లబ్ది చేకూరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సోయం విజయనిర్మళ, మండలాధ్యక్షుడు ఆత్రం సాయి, మాజీ సర్పంచ్ ఎల్కారి రమేష్, వార్డుసభ్యులు పోశం, అరుణ్, బొల్లబోయిన శేఖర్, మహిళా నాయకురాలు గంగుబాయి, అమృత పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి జడ్పీటీసీ దంపతుల స్థలం దానం



నవతెలంగాణ - హాజీపూర్

మండలంలో ఎలక్ట్రిక్, మేస్త్రి, సెంట్రింగ్, పెయింటింగ్, వడ్ల, ప్లంబర్ తదితర రకాల సంఘాలకు భవనం నిర్మించుకోవడానికి రెండు గుంటల(ఐదు లక్షల విలువ) భూమి దానం చేసిన మానవత్వాన్ని చాటుకున్న జడ్పిటిసి సభ్యులు పుష్కర్ శిల్ప శ్రీనివాస్ రావు. ఈ మధ్యనే వీరు ప్రాథమిక పాఠశాలకు కూడా ఒక గుంట భూమిని ఇచ్చినందుకు కలెక్టరు చేతుల మీదుగా సన్మానం అందుకున్నారు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను శుక్రవారం రాత్రి భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులకు అందించారు. వీరి దాతృత్వంపై భవన నిర్మాణ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

30న తహసీల్దార్ కార్యాలయానికి తరలిరావాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలో ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలు, రేషన్ కార్డులు లేని వారు ఈ నెల 30న తహసీల్దార్ కార్యాలయానికి తరలిరావాలని పట్టణ ప్రజాసంఘాల కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లు, ఇళ్ల స్థలాల కోసం, రేషన్‌కార్డుల కోసం గతంలో ఆందోళనలు చేసినా ఫలితం లేని కారణంగా ఈ నెల 30న తహసీల్దార్‌లకు దరఖాస్తులు ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. దీనికి పెద్ద ఎత్తున అర్హులు తరలిరావాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మహిళా సంఘం నాయకులు పద్మ, లక్ష్మి, కేవీపీఎస్ నాయకులు ఉట్ల రవి, ఎస్ఎఫ్ఐ నాయకులు సుంకరి సాయికృష్ణ పాల్గొన్నారు.

నా రక్షణ నా బాధ్యత నినాదంతో పని చేయాలి : జిఎం గుప్తా

నవతెలంగాణ-నస్పూర్

నా రక్షణ నా బాధ్యత నినాదంతో ప్రతి ఒక్కరూ తమ రక్షణ కోసం అన్ని రక్షణ సూత్రాలను పాటించాలని జనరల్ మేనేజర్ (సేఫ్టీ) బెల్లంపల్లి రీజియన్ కెహెచ్ఎన్ గుప్తా అన్నారు. శుక్రవారం ఎస్ఆర్పి 3,3ఏ గనిలో రక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ ఇంటి నుండి రక్షణ సూత్రాలను ప్రారంభించాలని, వాహనంపై వచ్చే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ రక్షణ కోసం అన్ని రక్షణ సూత్రాలను ఇంట, బయట, గనిలో పాటించాలని సూచించారు. సేఫ్ ఆపరేటింగ్ ప్రొసీజర్‌లను ఎల్లప్పుడూ చదువుతూ అవగాహన పెంచుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అనంతరం గని అధికారులు జిఎం(సేఫ్టీ) గుప్తని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ ఎస్ఆర్పి గ్రూప్ గోపాల్‌సింగ్, ఇన్‌చార్జి విజయ్‌కుమార్, డివైజిఎం సంతోష్ కుమార్, అడిషనల్ మేనేజర్ శ్రీధర్‌రావు, రక్షణాధికారి మహేందర్, ఫిట్ సెక్రటరీ రిక్కల గోపాల్ పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థికి రూ.10వేల చెక్కు

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాలాపూర్ జడ్పీఎస్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆ గ్రామ సర్పంచి నైనాల తిరుపతి చేతుల మీదుగా పదివేల రూపాయల చెక్కును శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి సంవత్సరం మాజీ ఎంపీపీ, రిటైర్డ్ కెప్టెన్ డాక్టర్ జీవి విజయకుమార్ పదివేల రూపాయల బహుమతిని అందిస్తున్నారు. అందులో భాగంగానే ఈ చెక్కును విద్యార్థులకు అందించామన్నారు. పోటీపడి చదివి ఇలాంటి బహుమతులను అందుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుంపల తిరుపతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ కేంద్రం పనులపై సమీక్ష

నవతెలంగాణ-నస్పూర్

చెన్నూర్ ఏరియాలోని మూసి వేయబడిన 2ఇంక్లైన్ గని ఆవరణలో ఏర్పాటు చేయబోవు సోలార్ విద్యుత్ కేంద్ర పనులపై శుక్రవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి, జనరల్ మేనేజర్(సోలార్) జానకిరామ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్లు మాట్లాడుతూ మూసి వేయబడిన చెన్నూరు-2 ఇంక్లైన్ గని ఆవరణలో 11 మెగావాట్ల సోలార్ విద్యుత్ ఉత్పత్తి పనులను వీలైనంత తొందరగా పూర్తి చేసి అక్టోబరు నెలలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించాలని, దానికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సంబంధిత కాంట్రాక్టు కంపెనీ వారికి సూచించారు. ఇప్పటివరకు జరిగిన పనులపై కూలంకషంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ జి. రమేష్ బాబు, ఏరియా వర్క్ షాప్ డిజిఎం బి. చంద్రశేఖర్ రెడ్డి, సోలార్ డిజిఎం శ్రీనివాస్, సోలార్ ఎస్ఈ అప్పారావు, ఏరియా వర్క్ షాప్ ఈఈ రాకేశ్, సోలార్ ఎనర్జీ ఎవ్రిచ్ కంపెనీ ప్రతినిధి శ్రీనివాస రాజు, మదన్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

వారసంతలో జ్యూట్ బ్యాగుల పంపిణీ

నవతెలంగాణ-నస్పూర్

ఆర్కే-6 గని ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ వారోత్సవాల్లో భాగంగా ఆర్కే-6 కొత్త రోడ్‌లో జరిగే వార సంతలో ప్లాస్టిక్‌ను నిషేధించాలని కోరుతూ ఆర్కే5,6 గ్రూప్ ఏజెంట్ ఎ.వి రెడ్డి, గని మేనేజర్ తిరుపతి జ్యూట్ బ్యాగులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రూప్ ఏజెంట్ మాట్లాడుతూ స్వచ్ఛతా పఖ్వాడా, ప్రపంచ పర్యావరణ పరిరక్షణ పక్షోత్సవాలలో భాగంగా వార సంత ఆవరణలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత ఎంతో అవసరమని తెలిపారు. ప్లాస్టిక్ వాడడం వలన పర్యావరణానికి నష్టం వాటిల్లడం కాకుండా, మానవాళికి కూడా హాని జరుగుతుందని అన్నారు. ఆర్కే-6 గని మేనేజర్ ఇ.తిరుపతి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, ప్రతి ఒక్కరు క్లాత్ బ్యాగ్‌లను వాడలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ ఆఫీసర్ కె.శ్రీనివాస్, ఫిట్ ఇంజనీర్ శ్యాంకుమార్, ఇంజనీర్ ఆర్.మహేష్, గుర్తింపు సంఘం నాయకులు ఇప్ప భూమయ్య, వెంగల కూమార్‌స్వామి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఛైర్మన్‌కు వినతి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ పట్టణం వార్డు నెంబర్ 18లోని సంఘంబస్తీలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ కాలనీ వాసులు శుక్రవారం మున్సిపల్ ఛైర్మన్ సద్దాంహుస్సేన్, కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం ఇచ్చారు. తమ కాలనీలో చెత్త చెదారం పేరుకుపోయిందని, మురికి కాలువలను అసంపూర్తిగా నిర్మించి వదిలేయడంతో మురికి నీరు నిల్వ ఉండి రోగాలు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. తాగునీటికి కూడా ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. కాలనీలో ఖాళీగా ఉన్న స్థలంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే కాలనీలో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేసి పారిశుద్ధ్య సమస్య పరిష్కరిస్తానని ఛైర్మన్ హామీ ఇచ్చారు.

జమా మసీద్ అభివృద్ధికి కృషి

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలో జమా మసీద్ అభివృద్ధికి ఎంపీపీ తుల శ్రీనివాస్ రూ.4.50 లక్షల మంజూరు చేయడం జరిగిందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బండారు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ ఛైర్మెన్ కదం ప్రశాంత్ అన్నారు. శుక్రవారం వారి చేతుల మీదుగా ముస్లిం మత పెద్దలకు ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, మైనార్టీ నాయకులు ఇఫ్తేకర్ అహ్మద్, ముబీన్ ఆలం, ఖదీర్, గఫూర్, కౌసర్, ఖాజీసాబ్, అబూద్, మునీర్, ఇమ్రాన్, జుబెర్, రహిమోద్దీన్, ముస్తఫా, ముంతాజ్, సోహెల్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల కోసం రైతుల రాస్తారోకో



నవతెలంగాణ-దండేపల్లి

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకొని నెలలు గడుస్తున్నా డబ్బులు చెల్లించడం లేదంటూ మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన రైతులు రోడ్డుపై బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసి నెల రోజులు గడిచినా డబ్బులు చెల్లించకపోవడం శోచనీయమన్నారు. వానా కాలం సీజన్ ప్రారంభం కావడంతో పెట్టుబడి కోసం తాము అవస్థలు పడుతున్నామన్నారు. వెంటనే ధాన్యం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ప్రసాద్ అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి డబ్బులు చెల్లించే విధంగా చూస్తామని చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో లింగాపూర్ సమీప గ్రామాల రైతులు పాల్గొన్నారు.

స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించాలని జీవో నెంబర్ 317 బాధిత ఉపాధ్యాయ సంఘం నాయకులు డిమాండ్ చేశారు టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతి కుమారి, పిఆర్టియు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు లతో కలిసి అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి వినతి పత్రం అందజేసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల కేటాయింపులో భాగంగా 317 జీవోను అమలు చేసిందన్నారు. దీని ద్వారా జిల్లాకు ఇతర జిల్లాల నుండి పెద్ద మొత్తంలో ఉపాధ్యాయులు వచ్చారని తెలిపారు. ఇది స్థానికతను దెబ్బతీసే విధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికతను ఆధారంగా ఉపాధ్యాయులను తిరిగి కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో 317 జీవో బాధిత సంఘం నాయకులు పృథ్వీరాజ్, సాయికిరణ్, క్రాంతి, సూర్య, వినోద్ పాల్గొన్నారు.

రేషన్ దుకాణాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజలకు రేషన్ దుకాణాలను అందుబాటులో ఉంచుతున్నట్లు అదనపు కలెక్టర్ నటరాజ్ తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌లో రేషన్ దుకాణాన్ని అదనపు కలెక్టర్ నటరాజ్, జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్‌తో కలిసి ప్రారంభించారు. గతంలో డీలర్ లేని కారణంగా ఇన్‌చార్జ్‌లతో సరకుల సరఫరా చేపట్టారని అన్నారు. కాగ డీలర్ నియామకం కోసం ఇటీవల నిర్వహించిన రాతపరీక్షలో అర్హత సాధించిన శానం వినయకు ఈనెల నుండి ఆథరైజేషన్ ఇచ్చామని అన్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రిబ్బన్ కట్ చేసి దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రజలకు సరకులను అందచేశారు. అదేవిధంగా ప్రత్యేక పూజలు జరిపి నిర్వాహకులకు అభినందనలు తెలియచేశారు.

మున్సిపల్ అద్దె గదుల వేలం పూర్తి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన తొమ్మిది అద్దె గదుల వేలాన్ని శుక్రవారం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సేన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఈ వేలం నిర్వహించారు. మొత్తం తొమ్మిది గదులుండగా ఎస్టీకి కేటాయించిన రెండో నెంబర్ గదికి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. మిగిలిన ఎనిమిది గదులకు గాను 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన వేలం ద్వారా ఎనిమిది గదుల నుండి మున్సిపల్‌కు నెలవారీగా రూ. 31,350 అద్దె రూపేణా వసూలు కానున్నట్లు కమిషనర్ అంజయ్య తెలిపారు. వేలంలో గదులు రాని వారు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వారు చెల్లించిన రూ. 25 వేలను తిరిగి ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

ఉన్నత పాఠశాలలో పోషకుల సమావేశం

నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పోషకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యార్థుల చదువు, క్రమశిక్షణ గురించి చర్చించారు. అనంతరం సమావేశంలో ఉత్తమ పోషకులుగా ఉశన్నను సన్మానించారు. ఈ సమావేశంలో తలమడుగు గ్రామ సర్పంచ్ కళ్యం కరుణాకర్ రెడ్డి, ఎస్ఎంసీ ఛైర్మెన్ నేతుల గంగన్న, వీడీసీ ఛైర్మెన్ ఆసం రవి, హాస్టల్ వార్డెన్ నర్సింలు, మహారాష్ట్ర బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కాడే స్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై వినోద్‌రెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు అజయ్, మురళీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు లింగాల రాజన్న, రాజేశ్వర్, రమేష్, అనసూయ పాల్గొన్నారు.

సామాజిక సేవతో ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

- సర్పంచ్ నుండి ఎమ్మెల్యే టికెట్‌కు ప్రయత్నం

నవతెలంగాణ-కెరమెరి

రాజకీయాల్లోకి రావడం సంపాదన కోసమే అనే భావన పోయే విధంగా ప్రజల సంక్షేమం కోసమే అహర్నిశలు కష్టపడుతూ అభివృద్ధిని ఆకాంక్షించడమే కాకుండా పార్టీ ఆశీర్వదించి ఎమ్మెల్యే టికెట్ ఇస్తే పోటీ చేస్తానని చెబుతున్నారు అనార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ సేవ చేయడమే లక్ష్యంగా ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చానన్నారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చానని ఎన్నో కష్టాలకోర్చి ఈ స్థాయికి వచ్చినట్లు తెలిపారు. తాను చేసిన సేవలకు ప్రభుత్వం గుర్తించి 2005లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు అందుకున్నట్లు తెలిపారు. ధాన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తానని అదే సందర్భంలో వివిధ ప్రాంతాల్లో చూసిన సమస్యలు తనను రాజకీయాల వైపు ప్రేరేపితం చేశాయని తెలిపారు. అనార్‌పల్లి ప్రజలు తనపై నమ్మకం ఉంచి సర్పంచ్ అవకాశం ఇచ్చారని, వారికి ఎప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేశానన్నారు. ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు పార్టీ అవకాశం ఇస్తే బరిలో నిలుస్తానని తెలిపారు. నియోజకవర్గంలో మౌలిక వసతులు కల్పించడానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు.

రాథోడ్ శేషారావు గురించి..

తల్లిదండ్రులు చాష్లిబాయి, తులసిరామ్. రాథోడ్ శేషారావ్ విద్యావంతులు ఎంబీఏ చదివారు. భార్య సవిత ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, కూతురు



రాథోడ్ శేషారావ

అక్షిత(బీటెక్ ఐఐటి, ఢిల్లీ). కుమారుడు అక్షిత్ సైనిక పాఠశాల కోరుకొండలో 12వ తరగతి చదువుతున్నాడు. దాన్ ఫౌండేషన్‌లో అసోసియేట్ మేనేజర్‌గా పని చేశారు. 2000 -04 వరకు వివిధ హోదాల్లో పని చేశారు. ఐకేపీలో ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో డిపిఎం గా విధులు నిర్వర్తించారు. సహకార మిత్ర సంస్థ ప్రొఫెసర్ త్రిలోచన్ శాస్త్రి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బెంగళూరుతో కలిసి ప్రజామిత్ర ధాల్ మీల్ ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంత నిరుపేద రైతులకు సేవలందించారు. సామాజిక సేవ కార్యక్రమాలను అప్పటి ప్రభుత్వం గుర్తించి ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డుకు ఎంపిక చేసింది. 2005లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా ఉత్తమ సామాజిక కార్యకర్త అవార్డు అందుకున్నారు. రాజకీయాలపై ఉన్న ఆసక్తితో ప్రత్యక్షంగా ప్రజలకు సేవలందించేందుకు గత సర్పంచ్ ఎన్నికల్లో అనార్‌పల్లి సర్పంచ్‌గా పోటీ చేసి గెలుపొందారు.



అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాంతో శేషారావు

అవకాశమిస్తే రాజకీయాల్లోకి వస్తా...!

- వాలంటరీ రిటైర్డ్‌మెంట్ తీసుకోనున్న టీజీఓ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌నాయక్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



అవకాశమిస్తే రాజకీయాల్లోకి వస్తానని టీజీఓ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్యామ్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యోగ సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ ఉద్యోగ సంఘం నాయకుడిగా ఉన్న సమయంలో రాజకీయ పరంగా పూర్తి సమయం కేటాయించలేకపోయానని అన్నారు. నా ప్రోత్సహంతోనే నా సతీమణి రేఖానాయక్ రాజకీయాల్లో కొనసాగుతున్నారని అన్నారు. ఆమె భవిష్యత్తే నాకు ముఖ్యమని పేర్కొన్నారు. వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నానని, ఈ నెల 30న పదవీవిరమణ చేయబోతున్నానని తెలిపారు. అంగబలం, అర్థబలం లేకున్నా ఆత్మవిశ్వాసం ధృడంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అనేక పోరాటాలు చేశామని అన్నారు. నా ప్రతిష్టతను దిగజార్చడానికి కొంతమంది ప్రయత్నం చేశారని అన్నారు. నన్ను అణగదొక్కేందుకు యత్నించారని అన్నారు. వారిని లీగల్‌గా ఎదుర్కొంటానని వ్యాఖ్యలు చేశారు. రాజకీయంగా నా సతీమణికి నావంతు పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. మరోసారి ఆమె విజయడంకా మోగించి, హ్యాట్రిక్ సాధించడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈనెల 30 తర్వాత నా రాజకీయ భవిష్యత్తుపై స్పష్టంగా వెల్లడిస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీజీఓల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వనజారెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు శివకుమార్, టీఎన్జీఓల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల నవీన్ కుమార్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కే.గంగాధర్, టీజీఓ, టీఎన్జిఓ సంఘాల సీనియర్లు రాజేందర్ దేశ్‌పాండే, తిరుమల్‌రెడ్డి, అరుణ ఉన్నారు.

సవారి బంగ్లా నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్‌లో నిర్మించనున్న సవారి బంగ్లా నిర్మాణానికి మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్ శుక్రవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. రూ.3లక్షల వ్యయంతో బంగ్లాను నిర్మించనుండగా స్థానిక నాయకులతో కలిసి భూమిపూజ చేశారు. బంగ్లాకు వచ్చే భక్తుల సౌకర్యార్థం వారికి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణం చేపట్టనున్నట్లు మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో సవారి బంగ్లాల నిర్మాణాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్ ఉన్నారు.

పశువులకు లంపీస్కిన్ వ్యాధి టీకాలు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని ఉండం గ్రామంలో పశువులకు లంపి స్కిన్ నివారణా టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాది వైరస్ వల్ల వస్తుందని అన్నారు. ఒక పశువు నుంచి మరో పశువులకు సోకే ప్రమాదం ఉందన్నారు. ఒకవేళ వచ్చిన యెడల వ్యాధి గ్రస్థ పశువులను దూరంగా ఉంచాలని అన్నారు. వ్యాధిరాని పశువులకు నివారణా టికాలను తప్పకుండా వేయించాలని అన్నారు. ఈ అవకాశాన్ని మండల రైతులు, పశుపోషకులు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కంది పోచ్చుబాయి నర్సింలు, పశు వైద్యాధికారి దూద్‌రాం, బీఆర్ఎస్ నాయకుడు మహేష్, పశు వైద్యసిబ్బంది స్వామి, సుదర్శన్, గోపాలమిత్ర, గంగన్న, జంగు, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

నవతెలంగాణ-బేల

వర్షాలు సంవృద్ధిగా పండి పంటలు బాగా పండాలని కోరుతూ బేల మండల కేంద్రంలో వివిధ కంపెనీల ఉద్యోగుల, డీలర్స్ అసోసియేషన్ సౌజన్యంతో కప్పతల్లి ఆట ఆడారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో గణేష్ మందిర్‌లో విఘ్నేశ్వరుని పూజలు చేశారు. అనంతరం రోలు రోకలి, కప్పకు పూజలు చేసి వర్షాలు సంవృద్ధిగా పడాలని మొక్కుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇంద్ర శేఖర్, డీలర్స్ అధ్యక్షుడు ప్రణయ్, గౌవర అధ్యక్షులు అనిల్ గుండావార్, కిషన్ వైద్య, నందు గుండావార్, కిరణ్ ముక్కావార్, ప్రకాశ్ పవార్, దినేష్, అమోల్, అనంత రాజు, ఆశన్న, గోవింద్ పాల్గొన్నారు. అనంతరం పలు కంపెనీ ఉద్యోగులు, వ్యాపార సముదాయాలు తిరిగి కప్పతల్లి ఆట ఆడారు, వారికి వ్యాపారస్తులు రోలుకు, కప్పకు పూజలు చేసి నీళ్లతో జాలాభిషేకం చేశారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరాలి



నవతెలంగాణ-బోథ్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జక్కుల వెంకటేష్ అన్నారు, శుక్రవారం మండల కేంద్రంలోని సాయినగర్‌లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగానే నాయకులు ప్రతి ఇంటింటికి తిరుగుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి సంక్షేమం పథకం ప్రజలకు చేరాలని అన్నారు. అనంతరం భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, బీజేవైఎం మండల అధ్యక్షులు ఓసా సాయి కుమార్, బీజేపీ మండల ఉపాధ్యక్షులు రాజన్న బీజేపీ పట్టణ అధ్యక్షులు రవితేజ పాల్గొన్నారు.

కంపోస్టు ఎరువు తయారీ నిరంతర ప్రక్రియగా కొనసాగాలి



నవతెలంగాణ-జైపూర్

గ్రామ పంచాయతీల పరిధిలో కంపోస్టు ఎరువు తయారీ నిరంతర ప్రక్రియగా కొనసాగాలని డీపీఓ వెంకటేశ్వర్‌రావు సూచించారు. శుక్రవారం మిట్టపల్లి, కానుకూరు, ముదిగుంట గ్రామ పంచాయతీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీల పరిధిలో సెగ్రిగేషన్ షెడ్‌లను సందర్శించి కంపోస్టు పిట్‌లను పరిశీలించారు. కంపోస్టు ఎరువును నర్సరీ, పల్లె ప్రకృతి వనం మొక్కలకు వినియోగించాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాల పరిశీలన, రోడ్డుపై ప్లాస్టిక్ లేకుండా శుభ్రం చేయించాలని తెలిపారు. గ్రామంలో ఎక్కడ కూడా ప్లాస్టిక్ చెత్త కనబడకుండా శుభ్రం చేయడానికి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ఇంటింటి చెత్త సేకరణ వంటి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో పాటు ఎంపీఓ అనిల్ కుమార్, సర్పంచులు కొయ్యడ వెంకటేశ్వర్‌గౌడ్, దుగుట జ్యోతి, కుంటాల సౌజన్య కార్యదర్శులు సురేష్, సురేందర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌పై అవగాహన

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌పై యువతీ, యువకులకు కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ నాయకుడు ఆడే గాజేందర్ అన్నారు. అలాగే విద్యార్థులు ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో పాల్గొని బహుమతులు స్కూటీ బహుమతిగా ఇవ్వనున్నట్లు తెలిపారు అలాగే క్విజ్ పోటీలలో 60 ప్రశ్నలు ఉంటాయని గంట సమయం ఉంటుందని ఎవరైనా ఆన్‌లైన్ పోటీలలో గెలుపొందుతారో వారికి స్కూటీ మొదటి బహుమతిగా అందజేయడం జరుగుతుందని అన్నారు. అలాగే మరిన్ని వివిధ రకాల బహుమతులు ఉంటాయని తెలిపారు. అందరూ రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ పోటీలలో పాల్గొనాలని, విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కుర్మే మహేందర్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, సొనాల గ్రామ అధ్యక్షుడు చెట్లపల్లి అనిల్, సీనియర్ నాయకులు బొడ్డు గంగారెడ్డి, వి.రాజశేఖర్, బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు ఈ మహేష్..

నవతెలంగాణ-దండేపల్లి



మండల కేంద్రానికి చెందిన యువకుడు నటరత్న యూత్ అధ్యక్షుడు బొమ్మన మహేష్ రోగులకు ఆపద కాలంలో రక్తదానం చేస్తూ ఆపద్బాంధవునిగా పేరు తెచ్చుకున్నాడు. గురువారం మండల కేంద్రానికి చెందిన మహిళ బైరి లచ్చవ్వ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరగా అత్యవసర పరిస్థితిలో రక్తం అవసరమైంది. మహేష్ స్పందించి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచాడు. మహేష్ ఇప్పటివరకు 28సార్లు రక్తదానం, రెండుసార్లు ప్లాస్మా దానం చేశాడు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. మహేష్ మాట్లాడుతూ తానే కాకుండా యూత్ సభ్యులు అందరూ కూడా రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్నారని, ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరం పడితే నటరత్న యూత్ కార్యకర్తలను సంప్రదించాలని కోరారు. అనంతరం యూత్ నాయకులు గుర్రం రాము నరసయ్య, మహేష్‌ను సన్మానించారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడని కొనియడారు. రక్తదానం చేసేందుకు మహేష్ బాటలో తాము కూడా నడుస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-భీమారం

ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంపొందిచుకోవాలని రిటైర్డ్ సీబీసీఐడీ ఏసీపీ రవికుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రపంచ హ్యాండ్‌బాల్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు క్రీడల పట్ల అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువులో రాణించేందుకు క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని తెలిపారు. తద్వారా విద్యార్థులకు మానసిక ఉత్తేజం కలుగుతుందని, దీంతో చదువులో అనుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి దోహదపడుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో జరుగనున్న హ్యాండ్ బాల్ ప్రీమియం లీగ్ పోటీల్లో ఎన్నికయ్యే విధంగా విద్యార్థులు సాధన చేసి తల్లిదండ్రులకు, పాఠశాల ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు, పీఈటీ విఠల్, ఉపాధ్యాయులు శ్రీమూర్తి, శ్రీనివాసరావు, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యాకమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

డీవీ.కృష్ణ సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాపంథా మార్గ నిర్దేశకుడు తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డీవీ. కృష్ణ ప్రథమ వర్ధంతి సభను పట్టణంలోని కుమురం భీమ్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు డీవీ.కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా నాయకులు జగన్‌సింగ్ మాట్లాడుతూ డీవీ కృష్ణ అరుదైన విప్లవ ఉద్యమ నాయకుడు తన జీవితాంతం విప్లవ ఉద్యమం కోసం తమ జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎన్నో పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు సుభాష్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు ఆత్రం వినోద్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సిడం సాయికుమార్, నాయకులు నితిన్ రవీందర్, రాజు శ్యాంసుందర్, రవి పాల్గొన్నారు.